క్లుప్తంగా

ఆర్.కృష్ణయ్యకు 'కోలా' సత్కారం



కృష్ణయ్యను సత్కరిస్తున్న కోలా గురువులు, కంట్రెడ్డి రామన్నపాత్రుడు

డాబాగార్డెన్స్ : జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య విశాఖ విచ్చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అయ్యారక డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కంట్రెడ్డి రామన్నపాత్రుడు నేతృత్వంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు సత్కరించారు.

30వ వార్డులో చెత్త తొలగింపు



చెత్త తొలగింపును పర్యవేక్షిస్తున్న కొడూరు అప్పలరత్నం

మహారాణిపేట : జీవీఎంసీ 30వ వార్డులో చెత్తను వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం (కొండమ్మ) ఆధ్వర్యంలో ఆదివారం తొలగించారు. తాడివీధి, కుమ్మరివీధి, ఏనుగుల వీధి, సాలిపేట తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ అప్పలరత్నం ఆధ్వర్యంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పెంటపల్లి సత్యనారాయణ వాహనాలు ఏర్పాటు చేసి తొలగింపజేశారు. వార్డు శానిటరీ ఇనస్పెక్టర్ శ్రీనివాసరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పేదలకు సేవలు అభినందనీయం



వివేకానంద సంస్థలో సభ్యులకు వస్త్రదానం చేస్తున్న శ్రీవత్సవ్

జగదాంబ : స్వామి వివేకానంద సంస్థలో అన్నదానం, వస్త్రదానం నిర్వహించారు. ఆశ్రమవాసి జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ హాజరై సభ్యులకు అన్న, వస్త్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు నిత్యం అన్నదానంతో పాటు ఇతర సేవలందిస్తున్న సంస్థను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు అప్పారావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు బియ్యం పంపిణీ



బియ్యం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రాము

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు పరిధి అల్లిపురంలో 30 పేద కుటుంబాలకు 4 కేజీల చొప్పున బియ్యం ఆ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరపల్లి రాము ఆదివారం అందజేశారు. ప్రతి నెలా బియ్యం అందజేస్తున్న రాముకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్‌పై శిక్షణ

సీతంపేట: విశాఖ పౌర గ్రంథాలయం, భారతీయ విద్యాభవన్ సంయుక్తంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలోని మియావాకి సెంటర్‌లో స్టోరీ టైం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ట్రైనర్ రబియ నవాజ్ 1 నుంచి 4వ తరగతి విద్యార్థులకు కాగితంతో వాల్ డెకరేటివ్స్ తయారీ, 5 నుంచి 8వ తరగతి విద్యార్థులకు నేమ్ ప్లేట్స్ తయారీపై శిక్షణ ఇచ్చారు.

ఇది కదా అభివృద్ధి

సంపూర్ణ సేవలకు.. అసలైన చిరునామా

పరిపాలన వ్యవస్థలో కీలకంగా మారిన గ్రామ, వార్డు సచివాలయాల్లో పూర్తి స్థాయి సేవలందుతున్నాయి. ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందించాలని, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో సీఎం జగన్ సచివాలయ వ్యవస్థకు అంకురార్పణ చేశారు.

- గ్రామ, వార్డు సచివాలయాలు
- సీఎం జగన్ లక్ష్యం నెరవేరుస్తున్న వైనం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఆన్‌లైన్ సేవలపై ఆరా తీస్తున్న సచివాలయాల ఇన్‌చార్జి పూర్ణిమాదేవి

మహారాణిపేట : గ్రామ స్వరాజ్యానికి, సుపరిపాలనకు సచివాలయాలు పూర్తిస్థాయిలో పని చేస్తున్నాయి. ప్రజలకు 29 ప్రభుత్వ శాఖలకు సంబంధించి సుమారు 540 రకాల సేవలు సచివాలయాల ద్వారా అందుతున్నాయి. అందుకు అవసరమైన ఆన్‌లైన్ సేవలను జిల్లా యంత్రాంగం అందుబాటులోకి తెచ్చింది.

ఆన్‌లైన్ వ్యవస్థతో సత్వర సేవలు..

గతంలో మీ-సేవా కేంద్రాల ద్వారా ప్రజలకు ఆన్‌లైన్ సేవలు అందేవి. ఇప్పుడు సచివాలయ వ్యవస్థ రావడంతో ఆన్‌లైన్ సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఈ సేవల కోసం కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు, టేబుళ్లు, బీరువాలు, ర్యాక్‌లు, కుర్చీలు తదితర సామగ్రి ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందజేసింది. సిబ్బందికి సెల్‌ఫోన్‌లు, 4జి సిమ్‌కార్డులు, ట్యాబ్‌లు కూడా అందించారు. కొన్ని సేవలకు అతి తక్కువ రుసుంతో గ్రామ, వార్డు సచివాలయాల్లో సేవలు అందుబాటులో ఉన్నాయి.



సేవా నిలయంగా ప్రజల మన్ననలు అందుకుంటున్న సచివాలయం

గతంలో మండల రెవెన్యూ, మండల అభివృద్ధి కార్యాలయాల్లో ఎలాంటి సేవలందించేవారో అవన్నీ సచివాలయాలకు అనుసంధానం చేసి అందజేస్తున్నారు.

సేవల్లో సచివాలయ సిబ్బంది..

ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలోనూ కార్యదర్శి, గ్రామ, వార్డు రెవెన్యూ అధికారి, ఏఎన్‌ఎం, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్-ఎడ్యుకేషన్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీసు, గ్రామ సర్వేయర్, అగ్రికల్చర్ అసిస్టెంట్, హార్టీకల్చర్ అసిస్టెంట్, పశుసంవర్ధక సహాయకుడు, ఫిషరీస్ అసిస్టెంట్, సెరీ కల్చర్ అసిస్టెంట్, వార్డు పారిశుధ్య కార్యదర్శి, ఎమినిటీస్, డిజిల్ అసిస్టెంట్లు ప్రజలకు సేవలందిస్తున్నారు.

అన్ని రకాల ధ్రువపత్రాలు అందజేస్తున్నాం..



సచివాలయాల్లో కావలసిన సేవలు అందుతున్నాయి. సిబ్బంది సంతృప్తికరంగా సేవలందిస్తున్నారు. ఆధార్ కార్డుల డౌన్‌లోడ్, విద్యకు సంబంధించిన ధ్రువపత్రాలు.. ఒకటేమిటి ఒక కుటుంబానికి ఏం కావాలో అవన్నీ సచివాలయాల ద్వారా అందజేస్తున్నాం.

– ఆర్.పూర్ణిమాదేవి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి, విశాఖ జిల్లా

అందుబాటులో సేవలు..



ప్రభుత్వ శాఖలకు చెంది.. ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలు సచివాలయాల ద్వారా అందజేస్తున్నాం. పలు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుల కోసం ప్రజలు ఎక్కువగా వస్తుంటారు. పారిశుధ్యం, పింఛన్ల పంపిణీతో పాటు సచివాలయాల ద్వారా అన్ని సేవలు అందజేస్తున్నాం.

– పి.జి.గణేష్ కుమార్, వార్డు పరిపాలన కార్యదర్శి, చిన్నమ్మవారివీధి సచివాలయం,

సచివాలయాలు వచ్చాక బాగుంది..



గతంలో కరెంటు బిల్లు కట్టాలంటే విద్యుత్ కార్యాలయం వద్ద క్యూ కట్టాల్సి వచ్చేది. కాని ఇప్పుడు సచివాయానికి వెళ్లి విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నాం. ఎంతో సులువుగా ఉంది. మా ఇంటి పక్కనున్న సచివాలయంలో అన్ని పనులు అయిపోతున్నాయి.

– వద్దాది మంగ వెంకట రత్నం, దిగువ రెల్లివీధి, ఏవీఎన్ కాలేజీ దగ్గర

శ్రమ లేకుండా పనులవుతున్నాయి..



మా పిల్లలకు అమ్మఒడి కోసం సచివాలయంలో దరఖాస్తు చేశాం. కొద్ది రోజుల తర్వాత అమ్మఒడి వచ్చినట్లు మెసేజ్ వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. గతంలో ఆన్‌లైన్ సేవల కోసం గంటల తరబడి పడిగాపులు కాసేవాళ్లం. ఇప్పుడు అటువంటి బాధలు లేవు. అన్ని పనులు సచివాలయాల ద్వారానే అయిపోతున్నాయి.

– కర్ణం పద్మావతి, మట్టా వెంకటప్ప వారి వీధి, టౌన్ హాలు రోడ్డు

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

డాబాగార్డెన్స్ : వాకర్స్‌క్లబ్ విశాఖపట్నం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. అధ్యక్షుడిగా డీవీ బాలాజీకుమార్, కార్యదర్శిగా పీవీ చంద్రశేఖర్, కోశాధికారిగా దుర్గా సోమేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. వాకర్స్‌క్లబ్ అంతర్జాతీయ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఎస్వీ రవీంద్ర వీరిచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ పూర్వ వైస్ చాన్సలర్ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ నియమాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ చక్కటి సేవలందించాలని, సంస్థ ఉన్నతికి దోహదపడాలన్నారు. కార్యక్రమంలో 39 మంది కార్యవర్గ సభ్యులతో పాటు పూర్వ అధ్యక్షుడు కె. సత్తిరాజు, కార్యదర్శి మధుసూదన్ వేద, కోశాధికారి సీహెచ్‌వీఆర్ గుప్తా, కార్యక్రమ చైర్మన్ ఎం. రాంజీ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లింగ భైరవి దివ్యపూజ

ఎంవీపీ కాలనీ: కోయంబత్తూర్‌లోని ఈషా యోగా సెంటర్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో లింగ భైరవి అమ్మవారి దివ్యపూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహం అందరికీ కలగాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. విశాఖ వేదికగా మొదటిసారిగా ఈ పూజ చేశామన్నారు. కోయంబత్తూర్ ఆశ్రమం నుంచి వచ్చిన 18 మంది శివంగ సాధకులతో లింగ భైరవి దివ్యపూజ చేసి అనంతరం శివంగ స్ఫూర్తిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

పెరిగిన పింఛన్ అందజేత



వెంకటేశ్వరమెట్టలో పింఛన్ అందజేస్తున్న సచివాలయ సిబ్బంది



దండుబజార్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న 30వ వార్డు కార్పొరేటర్ అప్పలరత్నం

అల్లిపురం : జీవీఎంసీ జోన్-4 పరిధి వేంకటేశ్వర మెట్టలో వృద్ధాప్య పింఛన్‌ను లబ్ధిదారుడు నమ్మి పైడిరాజుకు సచివాలయ సిబ్బంది పీవీ కిరణ్‌కుమార్, జాన్‌బాబు ఆదివారం అందజేశారు. ఈ నెల నుంచి రూ.3 వేలు పింఛన్ అందజేస్తుండడంతో వృద్ధాప్యంలో జగనన్న పెన్షన్ తమకు ఎంతో ఆర్థిక భరోసా ఇస్తుందని లబ్ధిదారుడు ఆనందం వ్యక్తం చేశారు.

దండుబజార్‌లో..

మహారాణిపేట : జీవీఎంసీ 30వ వార్డు దండుబజార్‌లో పెంచిన పెన్షన్లను ఆదివారం వార్డు కార్పొరేటర్ కొడూరు అప్పలరత్నం (కొండమ్మ) లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పెంటపల్లి సత్యనారాయణ, యూత్ అధ్యక్షుడు వద్దాది దిలీప్ కుమార్, పార్టీ వార్డు ఉపాధ్యక్షుడు దశమంతుల చిన్ని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగా మంజూరైన 15 పింఛన్లు నాయకులు లబ్ధిదారులకు అందజేశారు.

33,286 మందికి కంటి శస్త్ర చికిత్సలు



శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి

సింహాచలం: నేత్ర వైద్య సేవల్లో నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి అద్భుత పనితీరు కనబరుస్తోందని ఆస్పత్రి డీజీఎం కె. బంగార్రాజు తెలిపారు. 2023లో నిర్వహించిన శస్త్ర చికిత్సలు, ఇతర వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. 2023లో 33వేల 286 కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించినట్టు తెలిపారు. 1997లో ఆస్పత్రి స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు 4లక్షల 33వేల 286 కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించిందని తెలిపారు. రెటీనా, గ్లకోమా,కార్నియా వంటి ప్రత్యేక కంటి శస్త్ర చికిత్సల్లో ఉత్తమ ప్రగతి సాధించిందన్నారు. డాక్టర్ వైఎస్సార్‌సీ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 58 శాతం పైగా రోగులకు కంటి వైద్య స్సేవలు అందించామన్నారు. 2023లో గ్లకోమా నివారణకు ఒక రోగికి గ్లకోస్ ఐస్టంట్ శస్త్ర చికిత్స తొలిసారిగా నిర్వహించి రికార్డు సృష్టించినట్టు తెలిపారు. గాజువాక బీసీ రోడ్డులో అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో సేవలు సంక్రాంతి నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు. గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా అంధత్వ నివారణకు శంకర్ ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తోందని తెలిపారు.

ఉత్తరాంధ్ర కల్పవల్లికి విశేష పూజలు



విశేష పూజలందుకున్న కనకమహాలక్ష్మీ



ఉషానాయుడు డాన్స్ అకాడమీచే నిర్వహించిన కూచిపూడి నృత్యం



దేవులపల్లి శ్రీదేవిచే అన్నమాచార్య కీర్తనలు

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 25వ రోజు కనకమహాలక్ష్మి అమ్మవారిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, సర్వదర్శనం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2 వేల 500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ధర్మప్రచార మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం దేవులపల్లి శ్రీదేవిచే నిర్వహించిన అన్నమాచార్య కీర్తనలు, తిరువూరుకు చెందిన గోదా నరసింహారావుచే ఏర్పాటు చేసిన భక్తిరంజని, టి. ఉషానాయుడు డాన్స్ అకాడమీచే నిర్వహించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకున్నాయి.

11న మహాన్నదాన కార్యక్రమం..

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ప్రతి ఏడాదిలానే ఈ ఏడాది కూడా చివరి గురువారం (ఈ నెల 11న) మహాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి టౌన్‌కొత్తరోడ్డు, జగన్నాథస్వామి ఆలయం వద్ద 20 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఈవో కె. శిరీష తెలిపారు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు



బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం



విశేష అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం : బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామిదేవాలయం, ఎంబర్‌మన్నార్ దేవాలయం, ఘోషాస్పత్రి సమీపంలో గల సీతారామచంద్రస్వామి దేవాలయం, పోర్టు వేంకటేశ్వరస్వామి, అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి దేవాలయాల్లో గత నెల 16వ తేదీ నుంచి ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. భోగి వరకు ఆయా దేవాలయాల్లో పాశుర పఠనం నిత్యం జరగనుంది.

బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం..

అల్లిపురంలోని వెంకటేశ్వరమెట్టపై గల ప్రసన్న వేంకటేశ్వరస్వామి స్వయంభూగా బల్లిరూపంలో ఇక్కడ వెలిసారని ఆలయ చరిత్ర చెబుతోంది. డచ్చి వారు వ్యాపార నిమిత్తం వచ్చి ఇక్కడ సేద తీరిన సమయంలో వారి స్వప్నంలో కలియుగ వేంకటేశ్వరుడు కనిపించి తాను ఇక్కడ బల్లిరూపంలో వెలిసానని చెప్పటంతో ఇక్కడ దేవాలయం నిర్మించారు. దీంతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక ప్రాముఖ్యత సంతరించుకుంది. ఈ దేవాలయం స్వతహాగా ఉత్తరద్వారం కావటంతో విశిష్టత సంతరించుకుంది. ఈ నెల14వ తేదీన భోగి రోజు గోదా రంగనాథుల కల్యాణం అత్యంత వైభవంగా జరుగుతుంది. ఈ నెల 12వ తేదీన కుడారై ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు ఆలయ అర్చకుడు రాఘవాచార్యులు తెలిపారు. బల్లిగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంతో పాటు నియోజకవర్గంలోని కంచరవీధిలో ఎంబర్‌మన్నార్ దేవాలయం నిత్య ధూపదీప నైవేద్యాలతో విలసిల్లుతోంది. ధనుర్మాస ఉత్సవాలు నెల రోజుల పాటు జరుగుతాయి. ఘోషాస్పత్రి దరి కోదండ రామస్వామి దేవస్థానంలో కూడా ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దేవస్థానంలో నిత్యం ధూపదీప నైవేద్యాలు జరుగుతున్నాయి.



బల్లిరూపంలో స్వామి

నవ్వుల్లో ముంచెత్తిన హాస్యావధానం

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ వినూత్నంగా నిర్వహించిన హాస్యావధానం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వేదికగా వినోదాల విందులో భాగంగా అవదాన కార్యక్రమం నిర్వహించారు. జె.ఎల్.నరసింహం(అవధాని) , కామేశ్వరరావు(చమత్కార కవి, అప్రస్తుతం), ఎం.వి.సుబ్రహ్మణ్యం(సమన్వయం) పాల్గొన్నారు. పృచ్ఛకులుగా నండూరి రామకృష్ణ(సందేశం), డాక్టర్ రజని(దత్తపది) జబర్దస్త్ ప్రకాష్(ఆశువు), డేవిడ్‌రాజు(పేరడీ), శివజ్యోతి (వర్ణన), తులసి గణేష్(విచిత్ర అంశం) పాత్రలు పోషించారు. సంధ్యా ప్రియదర్శిని, ఎస్.ఎస్.నాయుడు, సభికులు కురిపించిన ప్రశ్నలకు అవధాని హాస్యం జోడించి చెప్పిన సమాధానాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. తిలక్ పట్నాయక్, మాల్యాద్రి, పురుషోత్తం, సన్ మూర్తి, దాడి సత్యనారాయణ అతిథులుగా పాల్గొని కళాకారులను ఘనంగా సత్కరించారు. ఇటీవల రెండు సార్లు ఉత్తమ హాస్య నటుడిగా నంది అవార్డు అందుకున్న డేవిడ్‌రాజును సన్మానించారు.

కలకాలం నిలవాలి స్నేహబంధం



ఆత్మీయ కలయికలో జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు



మాట్లాడుతున్న సీఐడీ అడిషనల్ ఐజీ శ్రీకాంత్

మురళీనగర్: తమ మైత్రీ బంధం కలకాలం నిలవాలని సీఐడీ విభాగం అడిషనల్ ఐజీ చెరువోలు శ్రీకాంత్ ఆకాంక్షించారు. జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ హైస్కూల్ 1986-87 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన తన స్నేహితులతోపాటు పాల్గొని ప్రసంగించారు. చిన్న నాటి మిత్రులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎంత ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ స్నేహితులతో కలిసి గడిపిన క్షణాలు జీవితాంతం గుర్తుకు వస్తాయన్నారు. ఇలాగే ప్రతి ఏడాది కలుసుకుందామని పిలుపునిచ్చారు. పూర్వ విద్యార్థుల బృందం తరపున మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు ససపల వరప్రసాద్ సంధాన కర్తగా వ్యవహరించారు. స్నేహితులు ఆత్మీయంగా పలకరించుకుని చిన్ననాటి సంఘటనలు జ్ఞాపకం చేసుకుని ఆనందంగా గడిపారు.

పూర్వ విద్యార్థుల సందడి

అమెరికాతోపాటు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో పని చేస్తున్న పూర్వ విద్యార్థులందరూ సందడి చేశారు. బెంగళూరు నుంచి పంచముఖి, అమెరికా నుంచి సాగర్, సీఐడీ అడిషనల్ ఐజీ చెరువోలు శ్రీకాంత్, హైదరాబాద్ నుంచి సీతారామశాస్త్రి(టీసీఎస్), వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఎంపీడీవోలు, ఆర్‌ఐలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొని ఆటపాటలతో అలరించారు. డాక్టర్ రాము తన స్నేహితులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. కోడి శ్రీనివాసరావు హాస్యం అలరించింది. ప్రతి ఏడాది జనవరి మొదటి ఆదివారం కలుసుకోవాలని నిర్ణయించారు. కష్టకాలంలో ఉనన తోటి స్నేహితుల కుటుంబాలను ఆదుకోవాలని నిర్ణయించారు. డాక్టర్ రాము, గెద్దం విజయ్, సలీమ్, సాగర్, పంచముఖి, ప్రసన్నకుమార్, కె.శ్రీనివాసరావు, ఆర్‌ఎస్‌వీ ప్రసాద్, మళ్ల రమేష్, భూపతిరాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కేరళీయుల క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మధు



ఏసుక్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలిపే సెట్

మురళీనగర్: నగరంలోని కేరళీయులు క్రిస్మస్ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రతి ఏడాది జనవరిలో నూతన సంవత్సరంతో పాటు క్రిస్మస్ వేడుకలను బిర్లా కూడలిలోని కేరళ కళా సమితిలో నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి కళా సమితి అధ్యక్షుడు ఏఆర్‌జీ ఉన్నిత్తన్ అధ్యక్షతన నిర్వహించిన సంబరాల్లో సినీ రచయిత, దర్శకుడు ప్రొఫెసర్ మధు ఎరవాంకర పాల్గొని అందరికీ క్రిస్మస్, న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పారు. కొత్త ఏడాదిలో కేరళీయుల కుటుంబాలు ఉన్నత స్థానంలో ఎదగాలని ఆకాంక్షించారు. చర్చి ఫాదర్‌లు జోఫీ చిరయత్, బ్లెస్సన్ ఫిలిప్, జెటీ వర్గీస్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌వో ప్లాంట్‌ను ముఖ్య అతిథి మధు ఎరవాంకర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఏసు జనన వృత్తాంతం ఆకట్టుకుంది. క్రిస్మస్ గీతాలు అలరించాయి. థింసా నృత్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో కళా సమితి కార్యదర్శి కె.హరిదాస్, డాక్టర్ రేజీ థామస్, పలువురు కేరళీయులు పాల్గొన్నారు.

'కటక్ ఫెస్టివల్'లో 'నాట్యం' విద్యార్థుల ప్రతిభ



గెలుపొందిన నాట్య విద్యార్థులు

సీతమ్మధార: కటక్‌లో నిర్వహించిన 15వ ఇంటర్నేషనల్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ ఫెస్టివల్-2024లో నార్త్ ఎక్స్‌టెన్షన్ దరి నాట్యం (నాట్యకళాక్షేత్రం) శిక్షణాలయానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆదివారం జరిగిన డ్యాన్స్ ఫెస్టివల్‌లో నాట్యకళాక్షేత్రం విద్యార్థులు తమ అభినయంతో ప్రేక్షకులను, అతిథులను మంత్రముగ్ధులను చేసి పలు విభాగాల్లో గెలుపొందారు. ఈ సందర్భంగా నాట్య గురువులు కె.వెంకట్ చిన్నారావు మాట్లాడుతూ విశాఖలో శిక్షణ పొందుతున్న తమ విద్యార్థులు కటక్‌లోనే కాకుండా ఇటువంటి పోటీలు ప్రపంచంలో ఎక్కడ జరిగినా విజయం సాధిస్తారన్నారు. పి.శ్రేష్ఠ, వి.కమల స్వేతిక, ఎస్.ఎల్.ఎస్.మాన్విత, ఇంటర్నేషనల్ నృత్య శిరోమణి సమ్మాన్ అవార్డులను సాధించారు. భరత నాట్యంలో సోలో డ్యాన్స్ కాంపిటేషన్ సీనియర్ విభాగంలో సాయి శ్రీనిధి ప్రథమ బహుమతి, జూనియర్స్‌లో ఎం.వినిద్ర, ఎ.లలితా శ్రీనిధి ప్రథమ స్థానం, టి.నిత్య ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. భరత నాట్యం సోలో డ్యాన్స్ సబ్ జూనియర్ విభాగంలో ఆర్.రాజశ్రీ నిపుణ ప్రథమ స్థానం, బి.నిషిత ద్వితీయ, పి.రుషిక తృతీయ స్థానాలు సాధించారు. నాట్య కళాకారులను జస్టిస్ డి.పి.చౌదరి అభినందించారు.